## క్లుప్తంగా

### 14 నుంచి సీపీఐ పాదయాత్ర

రావికమతం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి ఇంటింటికీ పాదయాత్ర కార్యక్రమం చేపడుతున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తెలిపారు. మండల కార్యదర్శి జి.జోగిరాజు ఆధ్వర్యంలో జి.చీడిపల్లిలో గురువారం పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల కమిటీ సభ్యుడు జోగారావు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మాకవరపాలెం: గౌరీదేవికి కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం 108 మంది మహిళలు గౌరీదేవికి కుంకుమార్చన చేశారు. భక్తిగీతాలు ఆలపించారు.

### భూ సమస్యలకు పరిష్కారం

నాతవరం: బ్రిటీష్ హయాం నుంచి వెంటాడే భూ సమస్యలకు సమగ్ర భూరీసర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. తన కార్యాలయంలో ఆయన గురువారం సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రీసర్వే చేస్తామన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. భూసమస్యలపై స్పందనలో వచ్చిన ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కారం చేయాలన్నారు. టీడీ చైన్లు, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి. కృష్ణ పాల్గొన్నారు.

### ప్రతి ఇంటికీ తాగునీరు


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

మాకవరపాలెం: ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని జి.వెంకటాపురంలో శివారు సుభద్రయ్యపాలెంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ. 13 లక్షలతో చేపట్టనున్న తాగునీటి కుళాయి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, నాయకులు పెట్ల భద్రాచలం, గాంధీ, గంగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డి పాల్గొన్నారు.

# అందరి ఆరోగ్యమే.. జగనన్న ధ్యేయం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- వడ్డాదిలో ఫ్యామిలీ డాక్టర్ల ప్రోగ్రాం ప్రారంభం


కె.నాయుడుపాలెంలో ఇంటింటా వైద్యం అందిస్తున్న వైద్యురాలు విమలగిరి


బుచ్చెయ్యపేట: బీపీ చెక్ చేయించుకుంటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోనే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం వడ్డాదిలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని దళిత సంఘం నాయకుడు కోరుకొండ సూరి అప్పారావుతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చి ధనికుడికి, పేదోడికి తారతమ్యం లేకుండా కార్పొరేటు ఆస్పత్రిలో వైద్య సేవలందించారన్నారు. ఇప్పుడు తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధనికుల ఇళ్లకు ప్రైవేటు వైద్యుడు వెళ్లి వైద్య సేవలందించినట్టే, మంచంపై ఉన్న పేదోడి ఇంటికెళ్లి ప్రభుత్వ డాక్టర్ సేవలందించేలా ఫ్యామిలి డాక్టరు కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఇటువంటి వైద్య సేవలతో ఆరోగ్య సమాజం సాధ్యమవుతుందన్నారు. ఈ ఉద్దేశంతోనే ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరి వైద్యుల్ని నియమించారన్నారు. ఆస్పత్రిలో ఒక వైద్యుడు ఉంటే, మరొక వైద్యుడు ఇంటింటికి తిరిగి వైద్య సేవలందిస్తారన్నారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తతో కలిసి ఇంటింటికి వెళ్తారన్నారు. నెలలో రెండు సార్లు వైద్యుడు వచ్చి వైద్య సేవలందిస్తారన్నారు. ఇందులో భాగంగా 67 రకాలు మందులు, 14 రకాలు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అనంతరం స్థానిక పార్టీ నాయకులు విజ్ఞప్తి మేరకు వడ్డాది పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరినాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, ఎంపీటీసీ ఇంటి అప్పారావు, నాయకులు కోరుకొండ రమణ, శంకర్రావు, వైద్యులు శకుంతల, మౌనిక, ఈవో లోవరాజు పాల్గొన్నారు.

రోలుగుంట: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా రోలుగుంట పీహెచ్‌సీ డాక్టరు విమలగిరి కె.నాయుడుపాలెంలో అంగన్‌వాడీ పిల్లలకు ఆరోగ్యపరమైన సూచనలు చేశారు. మరొక వైద్యురాలు ధనలక్ష్మి కొండపాలెంలో వైద్య సేవలు అందించారు.


నాతవరం: విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న ఇక్కడ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులను పరీక్షించి పలు సూచనలు చేశారు. సచివాలయం వద్ద రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## పది పరీక్ష కేంద్రాల్లో డీఎస్పీ తనిఖీ


ఎంఈవో, ఎస్ఐతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

మాకవరపాలెం: పదో తరగతి పరీక్ష కేంద్రాలను నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. స్థానిక ఉన్నత పాఠశాలతోపాటు తామరంలోని కృపాకమల్ స్కూల్లో కేంద్రాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఎవరున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్రాల్లోకి ఇతరులను అనుమతించొద్దని ఎస్ఐ రామకృష్ణారావుకు ఆదేశాలిచ్చారు. ఆయన వెంట ఎంఈవో నరేష్ ఉన్నారు.

మాడుగుల రూరల్: మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో గురువారం జరిగిన పరీక్షకు 734 మందికి గాను 727 మంది హాజరయ్యారని, ఏడుగురు విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈవో బి. దేముడమ్మ తెలిపారు. కె.జె.పురం, తాటిపర్తి, ఒమ్మలి పరీక్ష కేంద్రాలను ప్రత్యేక స్క్వాడ్ విద్యా శాఖ రీజనల్ డైరెక్టర్ జ్యోతి కుమారి పరిశీలించారు.

## వైభవంగా గ్రామ దేవతల పండగలు

మాకవరపాలెం: మండలంలోని ఆరు గ్రామాల్లో గ్రామ దేవతల పండగలు ఘనంగా జరిగాయి. భీమబోయినపాలెం, జి.వెంకటాపురం, యరకన్నపాలెం, ధర్మవరం గ్రామాల్లో మరిడమ్మ, రామన్నపాలెం, చిన రాచపల్లి గ్రామాల్లో బండితల్లి పండగలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎండను సైతం లెక్క చేయకుండా దర్శనం కోసం బారులు తీరారు. భీమబోయినపాలెంలో గ్రామ యువత భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. రాత్రి ఆయా గ్రామాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

**ఘనంగా మరిడిమాంబ పండగ**

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లిలో మరిడిమాంబ పండగను ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకొకసారి నిర్వహించే ఈ పండగ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంతాల భక్తులు దర్శించుకునేందుకు వేకువజాము నుంచే బారులు తీరారు. అమ్మవారి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



## ప్రభుత్వ భూములకు పూర్తి రక్షణ: ఆర్డీవో


పీపీ అగ్రహారం చెరువుకు సర్వే రాళ్లు ఏర్పాటు చేయిస్తున్న ఆర్డీవో, ఏపీడీ

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ స్థలాలకు పూర్తి రక్షణ కలిగించేలా సరిహద్దులు కేటాయించి సర్వే రాళ్లు ఏర్పాటు చేయిస్తామని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. గురువారం పీపీ అగ్రహారం చెరువు సరిహద్దులో సర్వే రాళ్ల ఏర్పాటును ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అన్ని గ్రామాల్లో చెరువులు, గెడ్డలు, వాగులు ఇతర ప్రభుత్వ భూములకు పూర్తి రక్షణ కల్పించేలా సర్వే రాళ్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. సర్వేయర్ సింహాచలం, ఈసీ డి.కొండాజీ పాల్గొన్నారు.

## రామాలయాల నిర్మాణాలకు రూ.30 లక్షల మంజూరు

రోలుగుంట: బుచ్చింపేటలో రెండు రామాలయాలకు, శివాలయం వద్ద కల్యాణ మండపానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో టీటీడీ నుంచి రూ. 30 లక్షలు మంజూరైనట్టు సర్పంచ్ ఉలబాల చంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో రామాలయాల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున మినీ కైలాసగిరి వద్ద కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించామన్నారు. త్వరలో వాటి నిర్మాణాలు చేపడతామన్నారు. వీటి నిర్మాణాలకు నిధుల మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి సర్పంచ్‌తోపాటు ఎంపీటీసీ సత్యవతి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

రావికమతం: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి వివరించేందుకు ఈ నెల 7 నుంచి చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్ విజయవంతం చేయాలని ఎంపీపీ పైల రాజు, మండల సచివాలయ కన్వీనర్ కె. జగన్నాథరావు కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మెటీరియల్‌ను గురువారం రావికమతంలో పంపిణీ చేశారు.

నాతవరం: వచ్చే ఎన్నికల్లో పార్టీ ఘన విజయమే ధ్యేయంగా పని చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. శృంగవరం, గన్నవరం, మన్యపురట్ల, పెదగొలుగొండపేట సచివాలయాలతోపాటు ఎ.పి.పురం పంచాయతీలో ఆయన మాట్లాడారు.

కె.కోటపాడు: గుల్లేపల్లి, రొంగలినాయుడుపాలెం, ఎ.కోడూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ మాట్లాడారు. ఎటువంటి వివక్ష లేకుండా, అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ సంక్షేమ లబ్ధిని కల్పించారన్నారు.

గొలుగొండ: ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలు అభిప్రాయం తెలుసుకోవాలని నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరానాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. ఏఎల్‌పురం, కొంకసింగి గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంపై మాట్లాడారు.

దేవరాపల్లి: దేవరాపల్లి, తామరబ్బ, చింతలపూడి, మామిడిపల్లి, వాకపల్లి గ్రామాల్లో అవగాహన సదస్సుల్లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు మాట్లాడారు. జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ పాల్గొన్నారు.

మాడుగుల/రూరల్: తొమ్మిది గ్రామ సచివాలయాల్లో మండల సచివాలయ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. గొటివాడ అగ్రహారం, ముకుందపురం, సాగరం, ఎం. కోడూరు, తాటిపర్తి, ఒమ్మలి, కేజేపురం, ఎం. కోడూరుల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

చీడికాడ: తురువోలు, అర్జునగిరి, చుక్కపల్లి గ్రామ సచివాలయాల్లో మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య అవగాహన కల్పించారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సర్పంచ్‌లదే

- ప్రభుత్వ పథకాలపై విప్ కరణం ధర్మశ్రీ సమీక్ష


కందిపూడిలో సర్పంచ్‌లతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సర్పంచ్‌లపై ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం కందిపూడిలో 35 పంచాయతీ గ్రామాల సర్పంచ్‌లు, ముఖ్య నాయకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలన్నీ అమలు చేశారని, ఆ ధైర్యంతోనే మరలా మనం ఎన్నికలకు వెళ్తున్నామన్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మరిసా నాని, వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, మండల కాపు, యాదవ సంఘం అధ్యక్షులు ముచ్చకర్ల అప్పారావు, నమ్మి అప్పలరాజు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ


ఎం. కోడూరులో పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ సంజీవిరావు

మాడుగుల రూరల్: వైఎస్సార్ పింఛను కానుక కింద కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం ఎం. కోడూరులో ఐదుగురికి సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు పంపిణీ చేశారు.


దేవరాపల్లి : విశాఖ ఘోషా ఆస్పత్రిలో రైవాడకు చెందిన వితంతు సింహాచలంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేష్


బుచ్చెయ్యపేట: విశాఖ కిమ్స్‌లో చికిత్స పొందుతున్న బంగారుమెట్టకు చెందిన జగన్నాథంకు పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ మంజు


పెదవాల్తేరు టీబీ ఆస్పత్రిలో శంభువానిపాలెంకు చెందిన దివ్యాంగుడు ఉల్లి సన్నిబాబుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గౌరి

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు


జెండా ఊపి క్లాప్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బోరు మరమ్మతుల అత్యవసర కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి బోరును పరిశీలించి ఎటువంటి లోపాలున్నా పరిష్కరించి తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, మండల ఇంజినీర్ పరదేశినాయుడు పాల్గొన్నారు.

## ఘనంగా పౌర్ణమి పూజలు


పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులు

నర్సీపట్నం: మున్సిపాలిటీ బలిఘట్టం ఉత్తరవాహినిలో వేంచేసిన పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో గురువారం పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వరుసగా మూణ్నెల్లపాటు పౌర్ణమి పూజలు ఆచరిస్తే నవగ్రహ దోషాలు పోతాయని వారి విశ్వాసం. పురోహితుడు రామం నవగ్రహ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

## చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని వాసవి క్లబ్ ప్రతినిధి వెలగా నారాయణరావు తెలిపారు. పాత బస్టాండ్ రోడ్డులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. క్లబ్ కార్యవర్గ సభ్యులు రమేష్, గుప్తా, డాక్టర్ సీఎస్.కుమార్, బంగార్రాజు, కన్నయ్యశెట్టి, సూర్యారావు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి వాసవి క్లబ్ చేయూత


నగదు అందిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

రావికమతం: కొత్తకోటలో ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబానికి వాసవీ, వనితా క్లబ్ సభ్యులు రూ.31,600 అందించి మానవత్వం చాటుకున్నారు. గ్రామంలో చిట్‌చాట్ వ్యాపారం చేస్తూ అందరితో కలివిడిగా ఉండే కలగర్ల బుచ్చిరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దాంతో అతడి కుటుంబాన్ని క్లబ్ సభ్యులు గురువారం పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో సభ్యులు కేదారిశెట్టి రమేష్, పెంటపాటి అశోక్, మాజీ ఉప సర్పంచ్ కేదారిశెట్టి గున్నాజీరావు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బాసట


బాధితురాలికి మేకలు అందిస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట: దిబ్బిడి గ్రామానికి చెందిన అర్జున కుటుంబ సభ్యులకు రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ అండగా నిలిచింది. వెన్నలకోట అర్జున ఏడాది క్రితం అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబానికి జీవనోపాధి నిమిత్తం సొసైటీ తరఫున ఆరు మేకలను కొనుగోలు చేసి అతని భార్య సత్యవతికి సంస్థ కార్యదర్శి గాడి శ్రీను గురువారం అందించారు.